కేటీఆర్ ప్రసంగం..
కార్యకర్తల్లో ఉత్సాహం



దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్‌లో శనివారం మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి కేటీఆర్ రావడంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి అభివాదం తెలుపుతూ వేదికపైకి వెళ్లి ప్రసంగించారు. కేటీఆర్ ప్రసంగంతో అక్కడ ఉన్న కార్యకర్తల్లో నూతనోత్సాహం కనిపించింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, నిజాంపేట్ మేయర్, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. – సుభాష్‌నగర్



తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

ఉప్పల్ ఆర్టీవో రవీందర్‌కుమార్, మేడ్చల్ డీటీఓ కిషన్



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు రవీందర్‌కుమార్, కిషన్



ఐడీపీఎల్ చౌరస్తాలో ప్లకార్డులతో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు

కుత్బుల్లాపూర్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఉప్పల్ ఆర్టీవో రవీందర్‌కుమార్, మేడ్చల్ డీటీఓ కిషన్ తెలిపారు. జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా పేట్‌బషీరాబాద్‌లోని మేడ్చల్ డీటీఓ కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతోందన్నారు. మూడు నిమిషాలకు ఒకరు మృత్యువాత పడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు.

◆ అధిక వేగంతో వాహనాలను నడపడం కారణంగానే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు, కార్లు నడిపే వారు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని సూచించారు. నిబంధనలను పాటించని వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు జి.రవి కుమార్, ప్రతాప్ రాజా, బి.అమృత వర్షిని, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్, రామకృష్ణ, ఇష్తేకార్ తదితరులు పాల్గొన్నారు.

పిలియన్ రైడర్లు సైతం హెల్మెట్ ధరిస్తే సురక్షితం

రంగారెడ్డినగర్: ద్విచక్ర వాహనాలను నడిపే రైడర్లతో పాటు వెనుక కూర్చునే పిలియన్ రైడర్లు సైతం హెల్మెట్ ధరిస్తే సురక్షితంగా ఉంటారని బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేష్ అన్నారు. శనివారం బాలానగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని గుడెన్‌మెట్, ఐడీపీఎల్ చౌరస్తాలో పాదచారులు, వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌సీఎస్‌సీ వలంటీర్లు, కంప్యూటర్లు ప్లకార్డులతో రోడ్డు దాటే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ... ఐడీపీఎల్ చౌరస్తా సమీపంలో ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని పాదచారులు వినియోగించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు నడిపే సమయంలో మొబైల్ ఫోన్లలో మాట్లాడొద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారితో పాటు వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 19మంది యువకులు



పట్టుబడ్డ యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ సందీప్

సుభాష్‌నగర్: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతున్న యువకులపై జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గాజులరామారం ప్రధాన రోడ్డు చిత్తరమ్మ గుడి వద్ద శనివారం ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ 19 మంది యువకులు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా ఎస్సై సందీప్ మాట్లాడుతూ.. సైబరాబాద్ కమిషనర్ ఆదేశాను మేరకు ఈ డ్రైవ్ చేపట్టామన్నారు. పట్టుబడ్డ యువకుల బైకులు స్వాధీనం చేసుకొని మాదాపూర్‌లో జరగనున్న కౌన్సిలింగ్‌కు వీరిని పంపిస్తామని తెలిపారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

జీపీ ప్రత్యేకాధికారుల సమావేశంలో కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు తమ విధులను బాధ్యతతో సక్రమంగా నిర్వర్తించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. రాష్ట్ర మంత్రి అనసూయ(సీతక్క) వీడియో కాన్ఫరెన్స్ అనంతరం శనివారం కలెక్టరేట్‌లో గ్రామ పంచాయతీ స్పెషల్ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారులు తమ విధులను ఎంతో జాగ్రత్తగా నిర్వర్తించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం సూచించిన విధంగా నడుచుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పని చేయాలని కోరారు. ఈ నెల 7 నుంచి 15 వరకు నిర్వహించే స్పెషల్ శానిటైజేషన్ డ్రైవ్ (ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం) విజయవంతం అయ్యేలా ఇప్పటి నుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇందులో యువతను ప్రోత్సహించి వారిని భాగస్వామ్యం చేసి సమన్వయంతో విజయవంతం చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఉపాధి హామీ కూలీల శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐసీఎస్ఎస్ఆర్‌కు ఎంపికైన అపరాజితమిశ్రా

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన పరిశోధక విద్యార్థిని అపరాజితమిశ్రా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ (ఐసీఎస్ఎస్ఆర్) డాక్టోరల్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. అంతేకాకుండా నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) కూడా క్వాలిఫైడ్ అయ్యారు. ఇటీవలే ఆమెకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఆమె హెచ్‌సీయూ ప్రొ.శివప్రసాద్, డాక్టర్ అలోక్‌కుమార్ పాండే పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు పరిశోధక, ఇతర విద్యార్థులు అభినందించారు.

నిథమ్ తాత్కాలిక డైరెక్టర్‌గా నిఖిలారెడ్డి

ప్రస్తుత డైరెక్టర్ డా.చిన్నంరెడ్డిని రిలీవ్ చేస్తూ జీఓ జారీ

రాయదుర్గం: నిథమ్ డైరెక్టర్ డాక్టర్ చిన్నంరెడ్డిని రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో తాత్కాలికంగా రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్ ,టీఎస్‌టీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఐఏఎస్ అధికారి కె నిఖిలారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. నూతన డైరెక్టర్ నాయకత్వంలో నిథమ్ పురోభివృద్ధి సాధిస్తుందని అధికారులు, ఉద్యోగులు స్పష్టం చేశారు.

హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని ఎన్ఎస్ఎస్ పార్కులో శనివారం 'క్లీనప్ డ్రైవ్' నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, శానిటేషన్, హార్టికల్చర్ విభాగం సిబ్బంది, డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ క్యాంపస్‌లో పచ్చదనం, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చేయడంతో పూర్తిగా ఎన్ఎస్ఎస్ సెల్ సహకరిస్తుందన్నారు. హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ డా.కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.భీంసింగ్, వలంటీర్లు సుధాకర్, హరిప్రసాద్, ప్రకాశ్, యాదయ్య,సిబ్బంది, విద్యార్థులు శ్రమదానం చేశారు.

ప్రభుత్వ ఉద్యోగాలకు రాజబాట 'గేట్'

పటాన్‌చెరు టౌన్: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) అనేది ప్రతిష్టాత్మక సంస్థలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు చదవడానికి మార్గం మాత్రమే కాదు, ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), పరిశోధనా కేంద్రాలు, ఇతర సాంకేతిక విభాగాలలో విస్తృత శ్రేణి ఉపాధి అవకాశాలకు బాటలు వేస్తుందని హైదరాబాద్‌లోని ఏస్(ఏసీఈ) ఇంజనీరింగ్ అకాడమీ అధ్యాపకుడు త్రినాథ్ అన్నారు.గీతం విశ్వవిద్యాలయంలోని, కెరీర్ గైడెన్స్ కేంద్రం ఆధ్వర్యంలో 'ప్రభుత్వ రంగ సంస్థలలో ఉపాధి అవకాశాలు' అనే అంశంపై శనివారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు.ఇంజనీరింగ్ పట్టభద్రుల భవిష్యత్తును రూపొందించడంలో గేట్ ప్రాముఖ్యతను వివరించారు.గేట్ నుంచి మార్కులను సాధించడం ద్వారా భారతదేశంలోని ఐఐఎస్‌సీ, ఐఐటీలు, ట్రిబుల్ ఐటీలు,ఎన్ఐటీల వంటి ప్రముఖ సాంకేతిక విద్యా సంస్థలలో మాస్టర్స్ (పీజీ)ని అభ్యసించడమే గాక, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగం పొందడానికి ఉపకరిస్తుందన్నారు. మనదేశంలోని ప్రధాన పీఎస్‌యూలలో తాజా ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. ఇక్కడ ప్రాథమిక అర్హత కోసం గేట్ తప్పనిసరని చెప్పారు. దీనికి అదనంగా, భారత రక్షణ పరిశోధన,అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో), భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో), బాబా అణు పరిశోధనా కేంద్రం (బార్క్) వంటి నాస్–పీఎస్ యూ కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడా గేట్ స్కోర్‌ల ఆధారంగా అభ్యర్థులను నియమించుకుంటాయని వివరించారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయకుంటే ఉద్యమమే: మాజీ మంత్రి తలసాని

సనత్‌నగర్: గడువు లోగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేయకుంటే ప్రజల పక్షాన పోరాడేందుకు వెనుకాడబోమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ప్రకటించిన 100 రోజుల్లో రెండు నెలలు గడిచిపోయాయని, ఇంకా 40 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. ఆ లోగా హామీలు అమలుచేయని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కులగణనపై చట్టం తీసుకురావాలి

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన నేపథ్యంలో తక్షణమే రాష్ట్ర అసెంబ్లీలో కులగణన కోసం చట్టం తీసుకురావాలని ఉమ్మడి ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్యగౌడ్ డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ప్రజా తెలంగాణ ఆధ్వర్యంలో బీసీ కులగణన అంశంపై మేధో మదన సదస్సు జరిగింది. సదస్సులో జస్టిస్ ఈశ్వరయ్యతో పాటు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడారు. బీసీల సమగ్రమైన వివరాలను సేకరించి అన్ని కులాల స్థితిగతులను తెలుసుకొని సమాన అవకాశాలు కల్పించేందుకు దోహదపడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసే నూతన కమిటీకి సమగ్ర సర్వే చేయడానికి కావలసిన పూర్తి సమాచారాన్ని అన్ని కులాల భాగస్వామ్యం అయ్యేలా అందజేయాలన్నారు. బీసీలు రాజకీయ, పరిపాలన, స్థానిక సంస్థల్లో వాటాను సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

కాంగ్రెస్ నుంచి ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి



దరఖాస్తు అందజేస్తున్న కాంగ్రెస్ నేత చింతల యాదగిరి

కుత్బుల్లాపూర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తే భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత చింతల యాదగిరి విజ్ఞప్తి చేశారు. మల్కాజిగిరి, వరంగల్, భువనగిరి పార్లమెంట్ పరిధిలో తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు శనివారం గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. గతంలో తాను ఏఐసీసీ సభ్యుడిగా, ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, టీపీసీసీ సభ్యుడిగా పని చేశానన్నారు. తన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని అవకాశం కల్పించాలని చింతల యాదగిరి కోరారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రీడాకారులతో మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్



జాతీయస్థాయి పోటీల్లో తలపడుతున్న పురుషుల జట్లు

నిజాంపేట్: క్రీడల్లో గెలుపోటములు సహజమని, కార్యదీక్షతో విజయం సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు. బాచుపల్లిలో జరుగుతున్న జాతీయస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలను శనివారం మల్లారెడ్డితో పాటు ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు వీక్షించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం వారు మాట్లాడారు. జాతీయ స్థాయి పోటీలకు బాచుపల్లి వేదిక కావడం గర్వంగా ఉందన్నారు. పోటీలను నిర్వహిస్తున్న కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న బాలూరు, బాలికల జట్లు శనివారం హోరాహోరీగా తలపడ్డాయి. ఏకేఎఫ్ఐ ఉపాధ్యక్షుడు కాసాని వీరేశ్, నిజాంపేట్ మేయర్ కొలన్ నీ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్లు కాసాని సుధాకర్ ముదిరాజ్, కాసాని శిరీష, చిట్లా దివాకర్, సురేష్‌రెడ్డి, సుజాత, కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రంగరయ ప్రసాద్, కొలను గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కాటికాపరి హక్కులను బ్యాగరి కులస్తులకే ఇవ్వాలి

పంజగుట్ట: హిందూ శ్మశానవాటికలలో కాటికాపరి వృత్తిపై సంపూర్ణ హక్కులను మాల బ్యాగరి కులస్తులకే కల్పిస్తూ జీవో ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి మాల బ్యాగరి వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు మన్నె శ్రీధర్ రావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి టి.పద్మాకర్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో సుందరీకరణ అనే పేరుతో కొన్ని శ్మశానవాటికలను అభివృద్ధి చేసి మహాప్రస్థానం, వైకుంఠధామం, ముక్తిఘాట్ అని పేర్లు పెట్టి టెండర్లు వేసి ప్రైవేట్ కాంట్రాక్టర్లకు, ఏజెన్సీలకు అప్పగించారని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ శ్మశానవాటికల్లో శవాల దహనం, పూడ్చిపెట్టడమే తమ వృత్తి అని ఇది తమ తాతల కాలం నుంచి చేస్తున్న పనే అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నామని శ్మశాన వాటికలను కాంట్రాక్ట్‌లకు అప్పగించరాదన్నారు.

హెచ్‌ఏఎల్‌ఈయూ ఐఎన్‌టీయూసీ నూతన కమిటీ

కూకట్‌పల్లి: హెచ్‌ఏఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఐఎన్‌టీయూసీ యాన్యువల్ జనరల్ బాడీ సమావేశంలో నూతన కమిటీని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి శనివారం ప్రకటించారు. సలహాదారులు గోపాలకృష్ణ, ఎ.సత్యనారాయణ, బషీరుద్దీన్, అధ్యక్షుడు మొహమద్ సిబ్గతుల్లాహ్, ప్రధాన కార్యదర్శి కర్క నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి. వెంకటపతి, డిప్యూటి ప్రధాన కార్యదర్శి పోలేపల్లి శ్రీకాంత్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వాజిద్ ఆలీ, ఉపాధ్యక్షులు వీపీఎస్ రమేష్, నెహ్రూ, ఎస్.శ్యామసుందర్, కోశాధికారి బాబు రావు, డిప్యూటీ కోశాధికారులు రావు, సీనియర్ జాయింట్ సెక్రటరీ లక్ష్మణ్, కరీంహిదాయతుల్లా, చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీలు మజాహార్, సుధాకర్, సీనియర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్ షకూర్, పరశురామ్, టి. సురేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ హుస్సేన్‌ను ప్రకటించారు.

సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా



స్థానికులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత కొలన్ హన్మంత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రశాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ జమ్మి దేవేందర్, కౌన్సిలర్ శివకుమార్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌కాయిస్ సిల్వర్ జూబ్లీని పురస్కరించుకుని మై స్టాంప్‌ను విడుదల చేస్తున్న ప్రతినిధులు



ఇన్‌కాయిన్ అద్భుతమైన విజయాలు సాధించింది

కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ సెక్రటరీ డాక్టర్ రవిచంద్రన్



సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

నిజాంపేట్: 25 ఏళ్ల చరిత్రలో ఇన్‌కాయిన్ ఎన్నో అద్భుతమైన విజయాలు సాధించిందని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ సెక్రటరీ డాక్టర్ రవిచంద్రన్ అన్నారు. ప్రగతినగర్‌లని ఇన్‌కాయిస్ సిల్వర్ జూబ్లీ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఇన్‌కాయిస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన రవిచంద్రన్, నీతి అయోగ్ సభ్యుడు విజయ్‌కుమార్ సరస్వత్‌లు మాట్లాడారు.

◆ 25 సంవత్సరాల కాలంలో ఇన్‌కాయిస్ ఎన్నో విజయాలను సాధించిందన్నారు. భారతదేశ చరిత్రలో మహాసముద్రాల పాత్ర, ఆర్థిక వ్యవస్థ దృక్పథంలో మహాసముద్రాల ప్రాముఖ్యత మొదలైన వాటి ప్రాముఖ్యతను గురించి వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాటలను గుర్తు చేస్తూ భారతదేశ జాతీయ జెండాలో నీలి చక్రం వలె నీలి ఆర్థిక వ్యవస్థ కేంద్రీకృతమై ఉందన్నారు. – 'వికాసిత్ భారత్'కోసం హిందూ మహాసముద్రం కోసం చేపట్టాల్సిన భవిష్యత్ దృక్పథాలకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్ కార్యాచరణపై సమాచారాన్ని అందజేస్తూ ఇన్‌కాయిస్ ఇప్పటికే ఈ కార్యకలాపాలను ప్రారంభించిందన్నారు. ఇన్‌కాయిస్ ప్రయత్నాలను, దాని భవిష్యత్తు దృష్టిని ప్రశంసించారు.

◆ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా ఇన్‌కాయిస్ 25 సంవత్సరాల ప్రయాణంపై హిందీ, ఆంగ్ల వెర్షన్‌లను పుస్తకాలను విడుదల చేయడంతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన 'శాటిలైట్ డేటా అక్విజిషన్, ప్రాసెసింగ్ ఫెసిలిటీ సెంటర్‌ను ప్రారంభించారు. రజతోత్సవాన్ని పురస్కరించుకుని దాని గుర్తుగా 'మై స్టాంప్'విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఎన్ఆర్ఎస్ఏ డైరెక్టర్ దీక్షితులు, ఇన్‌కాయిస్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ షెనాయ్, డాక్టర్ శైలేష్ నాయక్, హర్ష కె.గుప్తా, పీఎస్ గోయల్ తదితరులు పాల్గొన్నారు.

12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

డీఎం హెచ్‌ఓ డాక్టర్ రఘునాథ్‌స్వామి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఈ నెల 12న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ్ స్వామి కోరారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అల్బెండజోల్ మాత్రలను పాఠశాల వయస్సు పిల్లలకు వేయడం ద్వారా నులిపురుగుల నిర్మూలన లక్ష్యంగా ముందుకెళ్లాని డీఎంహెచ్‌ఓ రఘునాథ్‌స్వామి సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ మీడియా అధికారి అంజయ్య, వైద్యాధికారులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు ఉచితంగా..
సర్వైకల్ కేన్సర్ నివారణ వ్యాక్సిన్



రామ్‌దేవ్‌రావ్ ఆస్పత్రి యాజమాన్యానికి విరాళం అందజేస్తున్న మెరుగు సుచరిత



కేన్సర్‌పై మహిళలు నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న లయన్ సురేష్‌కుమార్..

నిజాంపేట్: ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా రాందేవ్ రావ్ ఆస్పత్రి సర్వైకల్ కేన్సర్ వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రాందేవ్ రావు ఆస్పత్రి దత్తత తీసుకున్న పాఠశాలలలోని 9 నుంచి 15 సంవత్సరం లోపు బాలికలకు శనివారం సర్వైకల్ కేన్సర్ నివారణ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా రామ్‌దేవ్ ఆస్పత్రి డాక్టర్ చాయదేవి మాట్లాడుతూ ప్రతి బుధవారం, శనివారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా 18 నుంచి 45 సంవత్సరాలలోపు మహిళలకు తమ ఆస్పత్రి సిబ్బంది ఉచితంగా మూడు డోసుల సర్వైకల్ కేన్సర్ వ్యాక్సిన్ ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బాచుపల్లికి చెందిన మెరుగు సుచరిత తన తల్లి విజయరాణి పేరిట ఆస్పత్రి యాజమాన్యం చేపట్టిన సేవా కార్యక్రమాలను మరింత మందికి చేరాలని కోరుతూ రూ.60వేల విరాళాన్ని అందజేశారు.

గణేష్‌నగర్‌లో మహిళలు అవగాహన ర్యాలీ..

చింతల్: కేన్సర్ పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంస్థ అధ్యక్షుడు, లయన్ సురేష్‌కుమార్ అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గణేష్‌నగర్‌లో మహిళలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ నేడు కేన్సర్ మహమ్మారి బారిన చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పడుతున్నారని, ఆహారపు అలవాట్లు, మారిన జీవనశైలితో ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయన్నారు. కేన్సర్‌ను ముందే గుర్తిస్తే నివారించడం సాధ్య పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ర్యాలీలో స్థానిక మహిళ లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.